కామారెడ్డిలో మంగళవారం రాత్రి నిర్వహించిన బస్సుయాత్ర రోడ్ షోకు హాజరైన అశేష జనవాహినిని ఉద్దేశించి ప్రసంగిస్తున్న బీఆర్ఎస్ అధినేత కే చంద్రశేఖర్‌రావు

కామారెడ్డి కదనభేరి.. మెదక్ రణభేరి

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రోడ్‌షోకు బ్రహ్మరథం • డప్పుల దరువు, కళా ప్రదర్శనలతో ఘనస్వాగతం

మహిళల మంగళ హారతులు.. యువత కేరింతలు • దిక్కులు పిక్కటిల్లేలా హోరెత్తిన జై కేసీఆర్ నినాదాలు • కాంగ్రెస్, బీజేపీ విధానాలను ఎండగట్టిన జననేత

నిజామాబాద్/సిద్దిపేట, మే 7 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఉద్యమాల ఊపిరిలూదిన కామారెడ్డి, మెదక్ జిల్లా కేంద్రాల్లో జన సునామీ పోటెత్తింది. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, గులాబీ దళపతికి రెండు చోట్ల ప్రజలు ఘనస్వాగతం పలికారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేపట్టిన బస్సుయాత్రకు అద్భుత స్పందన లభించింది. మంగళవారం సాయంత్రం నిజామాబాద్ నుంచి కామారెడ్డికి చేరుకున్న జననేతకు ప్రజలు నీరాజనం పలికారు. కామారెడ్డికి చేరుకోగానే బీఆర్ఎస్ శ్రేణులు వెల్లువలా తరలివచ్చి డప్పుల దరువు, గుస్సాడి నృత్యాలతో బస్సుయాత్రకు అపూర్వ స్వాగతం పలికారు. అశేష జనవాహిని వెంట రాగా కేసీఆర్ బస్సు యాత్ర కామారెడ్డి పుర వీధుల్లో 45 నిమిషాలపాటు సందడిగా కొనసాగింది. వేలాదిగా ఎదురుచూస్తున్న ప్రజలను చూసి కేసీఆర్ అభివాదం చేస్తూ ముందుకుసాగారు. బస్టాండ్, నిజాంసాగర్ చౌరస్తా, ప్రభుత్వ దవాఖాన నుంచి జేపీఎన్ రోడ్డుకు చేరుకున్నారు. మార్గ మధ్యలో వందలాది మంది మహిళలు కేసీఆర్‌కు మంగళ హారతులు పట్టారు. కేసీఆర్ ప్రయాణిస్తున్న బస్సుపైకి అడుగడుగునా పూల వర్షం కురిపించారు. బాన్సువాడ, జుక్కల్, ఎల్లారెడ్డి, కామారెడ్డి నియోజకవర్గాల నుంచి వచ్చిన ప్రజలతో 44వ జాతీయ రహదారి జన సంద్రాన్ని తలపించింది.

కామారెడ్డిలో మంగళవారం రోడ్‌షోలో ప్రజలకు విజయ సంకేతం చూపుతున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

ముక్తకంఠంతో బదులిచ్చిన ప్రజలు

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కామారెడ్డి చౌరస్తాకు చేరుకోగానే ప్రజలు జై కేసీఆర్.. జైజై కేసీఆర్ అంటూ దిక్కులు పిక్కటిల్లేలా నినదించారు. రోడ్‌షోలో ఆయన మాట్లాడుతున్నంత సేపు ఆసక్తిగా విన్నారు. వాగ్బాణాలు, విమర్శలతో సాగిన కేసీఆర్ ప్రసంగానికి సంపూర్ణ మద్దతు తెలిపారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను కేసీఆర్ ప్రశ్నించినప్పుడు ప్రజల నుంచి అపూర్వమైన స్పందన వచ్చింది. కల్యాణలక్ష్మి పథకంలో భాగంగా రూ.లక్ష సాయంతో పాటు తులం బంగారం ఇస్తామని చెప్పి మాట తప్పారని హస్తం పార్టీపై కేసీఆర్ మండిపడ్డారు. ఒక్కో అంశాన్ని ప్రస్తావిస్తూ కేసీఆర్ అడిగిన ప్రశ్నలకు జనాలంతా ముక్తకంఠంతో పథకాలేవీ రాలేదని చేతులూపుతూ బదులిచ్చారు.

కళాకారుల ధూంధాం

కామారెడ్డిలోని జేపీఎన్ రోడ్డులో తెలంగాణ ఆటా, పాటలతో నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అమలైన సంక్షేమ పథకాల వివరాలతో కళారూప ప్రదర్శనలు ప్రజలను ఆలోచింపజేశాయి. ప్రస్తుతం కాంగ్రెస్ హయాంలో ఏర్పడిన దుర్భర పరిస్థితిని కండ్లకు కట్టేలా కళాకారులు ప్రదర్శనలు ఇచ్చారు. కేసీఆర్‌ను చూసేందుకు వచ్చిన మహిళలు నృత్యాలతో సందడి చేశారు.

మురిసిన మెదక్ గడ్డ

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రాకతో మెదక్ జిల్లా కేంద్రం మురిసింది. మంగళవారం సాయంత్రం రాళ్లవాన, ఈదురుగాలను లెక్కచేయకుండా నియోజకవర్గ నలుమూలల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చారు. కామారెడ్డి నుంచి రామాయంపేట మీదుగా రాత్రి 9.15 గంటలకు మెదక్ పట్టణంలోని రాందాస్ చౌరస్తాకు చేరుకున్న కేసీఆర్‌కు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. గులాబీ పూల వాన కురిపిస్తూ అపూర్వ స్వాగతం పలికారు. ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌజ్ నుంచి రాందాస్ చౌరస్తా వరకు నేరుగా బస్సులో వచ్చారు. అప్పటికే అక్కడ ఇసుక వేస్తే రాలనంతగా జనం ఉన్నారు. మెదక్ పట్టణంలోని రహదారులకు కిరువైపులా భారీగా జనంతో కిక్కిరిసిపోయింది. కేసీఆర్ ప్రసంగాన్ని జనం ఆసక్తిగా విన్నారు. జై కేసీఆర్.. మళ్లీ మీరే రావాలి సార్.. అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. గ్యారెంటీల గురించి కేసీఆర్ ప్రజలను అడిగినప్పుడు.. రాలేదు అంటూ ప్రజలు సమాధానం చెప్పారు. యువత కేరింతలు కొడుతూ జై కేసీఆర్, జైజై కేసీఆర్ అంటూ నినాదాలు చేశారు. చౌరస్తాలోని నలుదిక్కులా ఉన్న భవనాలపై ప్రజలు ఎక్కి కేసీఆర్ ప్రసంగాన్ని విన్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీల మోసాలను ఎండగట్టినప్పుడు జనం తమ మద్దతు తెలిపారు. గత ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయని కాంగ్రెస్ పార్టీని ఏం చేద్దాం అన్నప్పుడు.. గట్టిగా బుద్ధి చెబుదాం అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. మీ జిల్లా బిడ్డను ఇక్కడ ఏం అభివృద్ధి చేసుకున్నామో మీ అందరికీ తెలుసు అన్నప్పుడు.. మళ్లీ మీరే రావాలి సార్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. చివరగా కేసీఆర్ ఉర్దూలో ప్రసంగించారు.

జనంతో మమేకమై..

నిజామాబాద్ నుంచి బస్సులో కామారెడ్డికి వెళ్తున్న క్రమంలో ఇందల్వాయి టోల్‌గేట్ సమీపంలోని ఓ హోటల్‌లో కేసీఆర్ కాసేపు ఆగారు. ఆ హోటల్‌లో కాసేపు కూర్చొని పకోడీ తిన్నారు. సుమారు అరగంట సేపు అక్కడే గడిపారు. విషయం తెలుసుకున్న స్థానికులు పెద్ద ఎత్తున హోటల్ వద్దకు తరలివచ్చారు. వారిని ఆప్యాయంగా పలుకరించిన కేసీఆర్ వారితో సెల్ఫీలు దిగారు. కొంతమంది రైతులు, వృద్ధులతో మాట కలిపి వారి సాధక బాధకాలను విన్నారు.

తెలంగాణ నేలపై విషం చిమ్మకండి

- పదేండ్లలో ఏం చేశారో చెప్పండి
- మోదీకి కేటీఆర్ డిమాండ్

హైదరాబాద్, మే 7 (నమస్తే తెలంగాణ): ప్రధాని నరేంద్రమోదీ మంగళవారం రాత్రి రాష్ట్రానికి వచ్చిన నేపథ్యంలో తెలంగాణ సమాజం పక్షాన ఆయనకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కొన్ని ప్రశ్నలు సంధించారు. ఎక్స్ వేదికగా స్పందిస్తూ పవిత్రమైన తెలంగాణ నేలపై విషం చిమ్మవద్దని, దశాబ్దకాలంలో ఏం చేశారో విషయం చెప్పి ఓట్లు అడగాలని ప్రధానిని డిమాండ్ చేశారు.

- దయచేసి పవిత్రమైన ఈ నేలపై విషం చిమ్మకండి
- దశాబ్దకాలంలో ఏం చేశారో విషయం చెప్పి ఓట్లు అడగండి
- ప్రధానిగా పదేండ్లు గడిచినా తెలంగాణ ప్రధాన హామీలను ఎందుకు మరిచారో చెప్పండి
- ఒక్క తెలంగాణ సాగునీటి ప్రాజెక్టుకూ జాతీయ హోదా ఎందుకు ఇవ్వలేదో చెప్పండి..
- మా యువతకు ఉపాధినిచ్చే కాజీపేట కోచ్ ఫ్యాక్టరీని ఎందుకు పాతరేశారో చెప్పండి
- మా ఏజెన్సీ బిడ్డలకు బతుకు దెరువు నిచ్చే బయ్యారం స్టీలు ఫ్యాక్టరీని ఎందుకు బొందపెట్టారో చెప్పండి
- మా నవతరానికి కొండంత భరోసా నిచ్చే ఐటీఐఆర్ ప్రాజెక్టును ఎందుకు ఆగం చేశారో చెప్పండి
- తమ పిల్లల బంగారు భవితపై ఆశలు పెట్టుకున్న లక్షల మంది తల్లిదండ్రుల ఆశయంపై ఎందుకు నీళ్లు జల్లారో చెప్పండి..
- తెలంగాణకు ఒక్క నవోదయ, ఒక్క మెడికల్ కాలేజీ,
- ఒక్క నర్సింగ్ కళాశాల, ఒక్క ఐఐటీ, ఒక్క ట్రిపుల్ ఐటీ,
- ఒక్క ఐఐఎం, ఒక్క ఐసర్, ఒక్క ఎన్ ఐడీ అయినా ఎందుకివ్వలేదో చెప్పండి
- సాగునీటి ప్రాజెక్టులను కేంద్రం గుప్పిట్లో పెట్టుకుని మా రైతులపై ఎందుకు పెత్తనం చేస్తున్నారో చెప్పండి..
- లక్షల ఎకరాల్లో పంటలు ఎండినా, 200కు పైగా రైతులు ఆత్మహత్య చేసుకున్నా..
- కాంగ్రెస్ సర్కారు పాపానికి నేతన్నలు బలైపోతున్నా తెలంగాణవైపు ఎందుకు కన్నెత్తి చూడలేదో చెప్పండి
- చేనేత రంగంపై జీఎస్టీ వేసి మగ్గానికి ఎందుకు మరణశాసనం రాశారో చెప్పండి
- తెలంగాణకు కష్టపడి తెచ్చుకున్న పరిశ్రమలను బీజేపీ రాష్ట్రాలకు ఎందుకు తన్నుకుపోతున్నారో చెప్పండి..
- మండిపోతున్న నిత్యవసర ధరలను ఎందుకు అదుపు చేయలేకపోయారో చెప్పండి
- ముడిచమురు ధరలు తగ్గినా పెట్రోల్, డీజిల్ ధరలు ఎందుకు తగ్గలేదో చెప్పండి
- భావోద్వేగాలు రెచ్చగొట్టడం కాదు.. మీరిచ్చిన 2 కోట్ల ఉద్యోగాల హామీ ఏమైందో చెప్పండి..
- సబ్ కా సాత్, అచ్చే దిన్ లాంటి నినాదాలు ఎందుకు విధానాలుగా మారలేదో చెప్పండి
- పదేండ్లు గడిచినా మీ పాలనలో ఉచిత రేషన్ పథకం కింద ఇంకా 80 కోట్ల పేదలు ఎలా ఉన్నారో చెప్పండి
- అవినీతిపరులకు మీ పార్టీలో ఆశ్రయమిచ్చి, రాజకీయ ప్రత్యర్థులపై దర్యాప్తు సంస్థలను ఎందుకు ప్రయోగిస్తున్నారో చెప్పండి..
- అంబేద్కర్ రాసిన భారత రాజ్యాంగంపై ప్రజల సాక్షిగా ప్రమాణం చేసి
- అదే రాజ్యాంగాన్ని అందరి కండ్ల ముందే కాలరాయకండి!
- దేశ ప్రధానమంత్రిగా, ప్రధాన సమస్యలను పరిష్కరించకుండా
- ప్రజల దృష్టి మరల్చే ప్రయత్నాలు చేయకండి!!
- దేశం కోసం ఏదైనా 'విజన్' ఉంటే చెప్పండి. కానీ, దయచేసి సమాజంలో 'డివిజన్' మాత్రం సృష్టించకండి. చివరగా ఒక మనవి.. రెచ్చగొట్టే రాజకీయాలకు ఇక్కడ ఓట్లు పడవు. ఎందుకంటే ఇది తెలంగాణ గడ్డ. ప్రజా చైతన్యానికి అడ్డా.

పునరాలోచనలో మైనార్టీలు

- కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌కు షిఫ్ట్
- కేసీఆర్ రోడ్‌షోల్లో కోలాహలం

హైదరాబాద్, మే 7 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో మైనార్టీల ఆలోచనలో మార్పు వచ్చిందా? కాంగ్రెస్ నుంచి ఆ వర్గం తిరిగి బీఆర్ఎస్‌కు షిఫ్ట్ అవుతున్నదా? అంటే జరుగుతున్న పరిణామాలు అవుననే అంటున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మైనార్టీలకు కలిగిన మేలును, ఐదు నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వం వేసిన అడుగులతో బేరీజు వేసుకుంటున్న ఆ వర్గం తిరిగి బీఆర్ఎస్ వైపు మళ్లుతున్నదనే సంకేతాలు కనిపిస్తున్నాయని సామాజిక విశ్లేషకులు చెప్తున్నారు. కేసీఆర్ రోడ్‌షోలకు మైనార్టీలు భారీ ఎత్తున హాజరు కావడాన్ని ఉదహరిస్తున్నారు. రోజురోజుకు బీఆర్ఎస్ గ్రాఫ్ పెరుగుతున్నదని, అందులో మైనార్టీ షేర్ ఇమిడి ఉన్నదని అంటున్నారు.

అందులో భాగమేనా?

అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ వైపు మళ్లిన మైనార్టీ వర్గాలు ఐదు నెలల్లోనే అభిప్రాయాన్ని మార్చుకుంటారని అనుకోలేము. కానీ, గతంలో బీఆర్ఎస్ మైనార్టీ వర్గాలకు ఇచ్చిన భరోసా కాంగ్రెస్ హయాంలో కనిపించడం లేదు. అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి రావాలనే ఏకైక లక్ష్యంతో మైనార్టీలకు అలవికాని హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ ఆ తరువాత చేతులెత్తేసిందనే ఆరోపణలు మూటగట్టుకున్నది. మైనార్టీల్లో ఢిల్లీ దాకా పరిచయాలున్న షబ్బీర్‌అలీ లాంటి నాయకుడిని అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన సొంత నియోజకవర్గం నుంచి ఇతర ప్రాంతానికి పంపి ఓడగొట్టడమే కాకుండా ఆ తరువాత ఎమ్మెల్సీ పదవి కూడా ఇవ్వలేదని, ఉద్దేశపూర్వకంగానే శాసనసభలో తమ వర్గాన్ని లేకుండా చేసిందని ముస్లింలు ఆగ్రహంతో ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై, సీఎం రేవంత్‌రెడ్డిపై బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ చేస్తున్న వ్యాఖ్యలపై ఆ పార్టీలో ఎవరూ స్పందించకపోవడం వంటి పరిణామాలతో మైనార్టీ వర్గాలు పునరాలోచనలో పడ్డాయని చెప్తున్నారు. అర్వింద్ వ్యాఖ్యలకు స్పందించకపోవడమే కాకుండా, అమిత్‌షా సైతం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను తిప్పికొట్టకపోవడం వంటి పరిణామాలు ఆ వర్గాన్ని అయోమయానికి గురిచేస్తున్నాయని విశ్లేషకులు ఉదహరిస్తున్నారు.

కాంగ్రెస్ పార్టీలో కలవరం

కేసీఆర్ రోడ్‌షోలు, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు నిర్వహిస్తున్న సమావేశాలు, రోడ్‌షోల్లో మైనార్టీల భాగస్వామ్యం కాంగ్రెస్ పార్టీని కలవరపెడుతున్నది. కేసీఆర్ మైనార్టీ వర్గాలను ఆకట్టుకుంటున్నారు. బీఆర్ఎస్ పాలనలో అందించిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను గుర్తుచేస్తున్నారు. రంజాన్ సందర్భంగా తమ సర్కార్ అందించిన తోఫా ఈసారి ఎందుకు రాలేదని కేసీఆర్ వేస్తున్న ప్రశ్నకు ఈ వర్గం నుంచి స్పందన వస్తున్నదని, ఇది ఆ వర్గం ఆలోచనలో మార్పునకు సంకేతమని చెప్తున్నారు. పదేండ్ల పాలనలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మైనార్టీ సంక్షేమాన్ని పట్టించుకోకపోవడమే కాకుండా కలిసి ఉన్న ప్రజల మధ్య చిచ్చుపెడుతున్నదని కేసీఆర్ వివరిస్తున్న తీరుతో ఆ వర్గం పునరాలోచనలో పడేందుకు దోహదం చేసిందని పరిశీలకులు వివరిస్తున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న రాకేశ్‌రెడ్డి. చిత్రంలో మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే పల్లా, ఎమ్మెల్సీ తాతా మధు

రాకేశ్‌రెడ్డి నామినేషన్ దాఖలు

వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గానికి బీఆర్ఎస్ అభ్యర్థిగా ఏనుగుల రాకేశ్‌రెడ్డి నామినేషన్ వేశారు. మంగళవారం నల్లగొండలో జరిగిన ఈ కార్యక్రమానికి మూడు ఉమ్మడి జిల్లాల నుంచి మాజీ మంత్రులు, ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నేతలు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. వందల మందితో ర్యాలీ నిర్వహించారు. మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, సత్యవతిరాథోడ్, ఎమ్మెల్సీ తాతా మధు, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి వెంట రాకేశ్‌రెడ్డి నామినేషన్ పత్రాలను అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారికి అందజేశారు.

కాంగ్రెస్, బీజేపీ ఒక్కటై కుట్రలు

- మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, సత్యవతిరాథోడ్ ఆరోపణ
- నల్లగొండ ఎమ్మెల్సీ స్థానానికి రాకేశ్‌రెడ్డి నామినేషన్ దాఖలు

నల్లగొండ ప్రతినిధి, మే 7 (నమస్తే తెలంగాణ): పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ కలిసికట్టుగా బీఆర్ఎస్ ఓటమికి కుట్రలు చేస్తున్నాయని మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, సత్యవతి రాథోడ్ విమర్శించారు. మంగళవారం నల్లగొండలో పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి రాకేశ్‌రెడ్డి నామినేషన్ వేసిన అనంతరం బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి గెలుపు కోసం మోదీ సహకరించగా, ప్రస్తుతం ఎంపీ ఎన్నికల్లో మోదీని గెలిపించేందుకు రేవంత్‌రెడ్డి పాట్లు పడుతున్నాడని ఆరోపించారు. బీఆర్ఎస్ గెలుపును అడ్డుకునేందుకు ఇరు పార్టీల వారు ఒక్కటయ్యారని విమర్శించారు. ఎన్నికల్లో ఓటమి తప్పదన్న భయంతో ఒకరు దేవుళ్లపై ఒట్లు వేస్తున్నారని, మరొకరు దేవుళ్ల పేరు మీద ఓట్లు అడుగుతున్నారని మండిపడ్డారు. గోదావరి జలాలను తరలించుకుపోవాలని మోదీ కుట్రలు చేస్తున్నారని, ఇలాంటి కుట్రలను ఆపే దమ్ము ఒక్క కేసీఆర్‌కే ఉన్నదని సూచించారు. సాగర్ ప్రాజెక్టును కేఆర్ఎంబీకి అప్పగించాలని చూసిన కాంగ్రెస్ ప్రభుత్వం నల్లగొండ వేదికగా లక్ష మందితో కేసీఆర్ గర్జిస్తే వణికిపోయిందని గుర్తుచేశారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ తాతా మధు మాట్లాడుతూ.. నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గం ఏర్పడిన నాటి నుంచి నాలుగుసార్లు బీఆర్ఎస్సే విజయం సాధించిందని, ఇప్పుడు కూడా గులాబీ జెండా ఎగురవేసేందుకు అందరం కంకణబద్ధులం కావాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, జడ్పీ చైర్మన్లు ఎలిమినేటి సందీప్‌రెడ్డి, గుజ్జ దీపిక, మాజీ ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కర్‌రావు, గాదరి కిశోర్‌కుమార్, చిరుమర్తి లింగయ్య, పైళ్ల శేఖర్‌రెడ్డి, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, కంచర్ల భూపాల్‌రెడ్డి, బొల్లం మల్లయ్యయాదవ్, నోముల భగత్, బూడిద భిక్షమయ్యగౌడ్, తిప్పన విజయసింహారెడ్డి, డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, రాష్ట్ర నేతలు ఒంటెద్దు నర్సింహారెడ్డి, చెరుకు సుధాకర్, పాల్వాయి స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ పర్యటనలో పవర్‌కట్

ఇందూర్ ముఖ్యనేతలతో భేటీలో గంటన్నరపాటు నిలిచిపోయిన విద్యుత్తు

ఖిలీల్‌వాడి, మే 7: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిజామాబాద్ పర్యటనలో ఉండగా, గంటన్నరకుపైగా విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా నిజామాబాద్ జిల్లాకు వచ్చిన కేసీఆర్ సోమవారం రాత్రి మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా నివాసంలో బస చేశారు. మంగళవారం ఉదయం పార్టీ ముఖ్య నేతలతో సమావేశమైన బీఆర్ఎస్ అధినేత జిల్లాలో పరిస్థితిపై ఆరా తీశారు. అయితే, కేసీఆర్ బస చేసిన ప్రాంతంలో సుమారు గంటన్నరపాటు కరెంట్ పోయింది. జనరేటర్ అందుబాటులో ఉండటంతో ఎలాంటి ఇబ్బంది కలుగలేదు. విద్యుత్తు సరఫరా నిలిచిపోవడంతో ఆగ్రహానికి గురైన ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు విద్యుత్తు ఎస్ఈకి ఫోన్ చేయగా స్విచాఫ్ వచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కరెంట్ కోతలు లేవని చెబుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఇది కనిపించడం లేదా? అని బీఆర్ఎస్ నేతలు ప్రశ్నించారు.

pnb | పంజాబ్ నేషనల్ బ్యాంక్ | punjab national bank

(భారత ప్రభుత్వరంగ సంస్థ)

సర్కిల్ ఆఫీస్ సికింద్రాబాద్, 103, 8-2-248-ఎ, మహర్షి హౌస్, రోడ్ నెం.-3, బంజారాహిల్స్, హైదరాబాద్-500034, టెలిఫోన్:-040-23147037 ఇమెయిల్: cosecops@pnb.co.in

నిద్రాణమైన/పనిచేయని ఖాతాల మూసివేత కొరకు బహిరంగ ప్రకటన

అనేక ఖాతాలలో గత 3 సంవత్సరాల నుండి కస్టమర్ ఎటువంటి ఆపరేషన్ చేయలేదని మరియు ఈ ఖాతాలలో బ్యాలెన్స్ లేదని బ్యాంక్ గమనించింది. ఈ ఖాతాలు దుర్వినియోగం కాకుండా చూసుకోవడానికి, స్వాభావికమైన ప్రమాదాన్ని నివారించడానికి అటువంటి ఖాతాలను మూసివేయాలని బ్యాంక్ నిర్ణయించింది.

అందువల్ల, 30.04.2024 నాటికి 3 సంవత్సరాలకు పైగా తమ ఖాతాను ఆపరేట్ చేయని మరియు వారి ఖాతాలో జీరో బ్యాలెన్స్ లేదా బ్యాలెన్స్ లేని ఖాతాదారులందరికీ, సంబంధిత బ్రాంచ్‌లో KYC పత్రాలను సమర్పించడం ద్వారా ఖాతా యాక్టివేట్ చేసుకొనకపోతే, ఈ నోటీసు ప్రచురణ తర్వాత తదుపరి ఎటువంటి నోటీసు లేకుండా 08.05.2024 నుండి నెల రోజుల తర్వాత ఈ ఖాతాలు మూసివేయబడతాయి.

ఈ ప్రక్రియ క్రింద DEMAT ఖాతాలకు లింక్ చేయబడిన ఖాతాలు, లాకర్‌లు, యాక్టివ్ స్టాండింగ్ ఇన్‌స్ట్రక్షన్ ఉన్నవి, 25 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న కస్టమర్ ఖాతాలు, మైనర్‌ల ఖాతాలు, PMJJBY/PMSBY/SSY/APY, DBT వంటి నిర్దిష్ట ప్రయోజనం కోసం తెరవబడిన ఖాతాలు మరియు ఆర్డర్ ప్రకారం స్తంభింపజేయబడిన ఖాతాలు కోర్టు మరియు ఆదాయపు పన్ను శాఖ లేదా ఏదైనా ఇతర చట్టబద్ధమైన అటాచ్‌మెంట్స్ కలిగిన ఖాతాలు మూసివేయబడవు.

ఏదైనా ప్రశ్న/సహాయం విషయం కొరకు, మీరు మీ శాఖను సంప్రదించవలసిందిగా కోరడమైనది.

తేది: 08-05-2024 | సం/- అధీకృత అధికారి